# మంత్రి కేటీఆర్ సభకు గులాబీశ్రేణులు

కల్వకుర్తి రూరల్, నవంబర్ 5: కల్వకుర్తి మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఆమనగల్లులో జరిగే మంత్రి కేటీఆర్ సభకు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు పార్టీకి శ్రీరామ రక్షగా నిలుస్తాయన్నారు. నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ పర్యటనతో కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపనున్నారని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

**పటాకుల మోతలతో ర్యాలీ**

వెల్దండ, నవంబర్ 5 : ఆమనగల్లు పట్టణంలో ఆదివారం జరిగిన కేటీఆర్ ఆశీర్వాద సభకు వెల్దండ మండలంలోని అన్ని గ్రామాల నుంచి గులాబీ సైన్యం వేలాదిగా తరలివెళ్లారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలనుంచి ప్రజలు వాహనాల్లో ర్యాలీగా, డీజే డ్యాన్సలు, పటాకుల మోతల మధ్య ఆటా పాటలతో తరలివెళ్లారు. పోతెపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు డ్రెస్ కోడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వెల్దండలో కార్యకర్తలు పటాకులు పేల్చారు. దారులన్నీ ఆమనగల్లు సభ వైపే మల్లాయి. సభకు తరలివెళ్లిన వారిలో జెడ్పీటీసీ, ఎంపీపీతోపాటు వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నాయి.

**కడ్తాల్‌లో భారీ ర్యాలీ**

కడ్తాల్, నవంబర్ 5: ఆమనగల్లు పట్టణంలో ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. బహిరంగ సభకి కడ్తాల్ మండల కేంద్రంతోపాటు పరిధిలోని గ్రామాలు, తండాల నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కడ్తాల్ మండల కేంద్రంలో నిర్వహించిన భారీ ర్యాలీలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం మండలం నుంచి వందల సంఖ్యలో వాహనాల్లో బీఆర్ఎస్ శ్రేణులు సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**చారకొండ నుంచి..**

చారకొండ, నవంబర్ 5 : ఆమనగల్ పట్టణంలో నిర్వహించిన కేటీఆర్ బహిరంగ సభకు మండలంలోని జూపల్లి, చంద్రాయన్‌పల్లి, గోకారం, జేపల్లి, ఎర్రవెల్లి, శేరిఅప్పారెడ్డిపల్లి తదితర గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కల్వకుర్తి బీఆర్ఎస్ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ భారీ మెజార్టీతో గెలిపిస్తామని చంద్రాయన్‌పల్లి ఎంపీటీసీ గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, వెల్దండ సింగిల్ విండోచైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా నేత బాలేమియా, నాయకులు శేఖర్‌గౌడ్, తిరుపతయ్యాచారి, జగపతి తెలిపారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వాహనాల్లో భారీగా తరలివెళ్లారు.



కడ్తాల్‌లో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



వెల్దండ మండలం చొక్కన్నపల్లి నుంచి కేటీఆర్ సభకు తరలుతున్న గులాబీ సైన్యం



వెల్దండ మండల కేంద్రంలో పటాకులు కాల్చుతున్న బీఆర్ఎస్ నాయకులు




చారకొండ నుంచి కేటీఆర్ సభకు తరలివెళ్తున్న గులాబీశ్రేణులు

## బీఆర్ఎస్‌లో చేరిన రాచూర్ తండావాసులు



గోళి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న రాచూర్‌తండావాసులు

వెల్దండ, నవంబర్ 5: మండలంలోని రాచూర్‌తండాకు చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు వందలాది మంది ఆదివారం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. తండాకు చెందిన రాజు ఆధర్యంలో తండావాసులు దాదాపు 150మంది రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్, కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గోళి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. రాఘాయిపల్లి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి గోళి శ్రీనివాస్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై తామంతా బీఆర్ఎస్‌లో చేరుతున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా గోళి మాట్లాడుతూ కార్యకర్తలందరికీ పార్టీ అండగా ఉంటుందని, అందరూ కలిసికట్టుగా ఉండి బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ను గెలుపించుకొందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, తండావాసులు లక్పతీనాయక్, సురేందర్, భాస్కర్, శ్రీను, గణేశ్ తదితరులు ఉన్నారు.

## బర్కత్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



బర్కత్‌పల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వెల్దండ, నవంబర్ 5 : మండలంలోని బర్కత్‌పల్లిలో ఆదివారం బీఆర్ఎస్ నాయకుడు, ఉప సర్పంచ్ నర్సింహ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ బీఆర్ఎస్ పార్టీ ప్రచార కరపత్రాలు పంచి పెట్టి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. ప్రజల సంక్షేమాభివృద్ధే కేసీఆర్ లక్ష్యమని అందరూ బీఆర్ఎస్‌కు అండగా ఉండి, మరోసారి ఎమ్మెల్యేగా జైపాల్‌యాదవ్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్‌కు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఫొటోగ్రాఫర్ యునియన్ సభ్యులు

ఊర్కొండ, నవంబర్ 5: మండల పరిధిలోని మాదారం గ్రామానికి చెందిన చలపతి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే నెలరోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొంది, స్వగ్రామం మాదారం వచ్చారు. మండల ఫొటోగ్రాఫర్ యునియన్ సభ్యులు ఆదివారం గ్రామానికి వెళ్లి అతన్ని కలిశారు. రూ.15వేలు సాయం అందించారు. వారిలో యునియన్ అధ్యక్షుడు సిద్దు, డివిజన్ అధ్యక్షుడు రవి, శ్రీకాంత్, సూరి, బాబు, జాఫర్, నిరంజన్, నాగరాజు, సోహెల్, బాబా తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



కృష్ణయ్య (ఫైల్)

కడ్తాల్, నవంబర్ 5: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ప్రమాదానికి సంబంధించి సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని న్యామతాపూర్ గ్రామానికి చెందిన జామకాయల వ్యాపారి గోపాల్‌దాస్ కృష్ణయ్య (47) జామకాయలను కొనుగోలు చేయడానికి, ఆదివారం తెల్లవారుజామున తన భార్య సుజాత, కుమారుడు విజయ్‌కుమార్‌తో కలిసి ఆటోలో స్వగ్రామం నుంచి ముద్విన్ గ్రామానికి బయల్దేరారు. ఆటో మార్గమధ్యలోని కడ్తాల్ టోల్‌ప్లాజా వద్దకు రాగానే, అదే సమయంలో హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న డీసీఎం ఆటోని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న కృష్ణయ్యకి తీవ్ర గాయలవగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన కృష్ణయ్యను హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# బలవంతంగా పార్టీ మార్చేందుకు యత్నం

- మాయమాటలు చెప్పి తీసుకెళ్లిన ఇద్దరిపై కేసు
- వివరాలు వెల్లడించిన నాగర్‌కర్నూల్ డీఎస్పీ మోహన్‌కుమార్

నాగర్‌కర్నూల్, నవంబర్ 5 : బలవంతంగా పార్టీ మార్పించేందుకు తీసుకెళ్లిన ఇరువురి నాయకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు డీఎస్పీ మోహన్‌కుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి డీఎస్పీ వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెంకటాపూర్ సర్పంచ్ కుమారుడు యాదగిరి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి వద్ద చురుకైన పార్టీ కార్యకర్తగా ఉండేవాడు. అతనితోపాటు పార్టీలో ఉన్న దొడ్ల ఈశ్వర్‌రెడ్డి, వనపట్ల సుబ్బారెడ్డి నెల 4న రాత్రి 8:30 గంటలకు యాదగిరికి ఫోన్ చేసి హైదరాబాద్‌లో కలవాలని ఎమ్మెల్యే చెప్పారని, మేమూ వస్తున్నాం.. నీవు కల్వకుర్తిలో ఉండని చెప్పారు. తర్వాత సుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మంతటి రాములు, మల్కాపూర్ లింగారెడ్డి కలిసి కారులో వచ్చి యాదగిరిని కల్వకుర్తిలో కారులో ఎక్కించుకొని హైదరాబాద్‌కు బయలుదేరారు. కొద్దిదూరం వెళ్లాక అందరం కాంగ్రెస్ పార్టీలో కలవబోతున్నామని అసలు విషయం చెప్పారు. అందుకు యాదగిరి నేను బీఆర్ఎస్‌లోనే ఉంటానని చెప్పడంతో అతడి సెల్‌ఫోన్ ఫ్లైట్ మోడ్‌లో పెట్టి బలవంతంగా తీసుకెళ్లారు. రాత్రి ఓ హోటల్లో ఉండి ఆదివారం టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఇంటికి తీసుకెళ్లగా వినకపోవడంతో దామోదర్‌రెడ్డికి చెప్పి భవిష్యత్‌లో మంచి అవకాశాలు కల్పిస్తామని బలవంతం చేస్తూ కాంగ్రెస్ కండువా కప్పారు. నాగర్‌కర్నూల్‌కు తిరుగు ప్రయాణంలో వెల్దండలో భోజనం కోసం కారు ఆపగా వారి నుంచి తప్పించుకొని యాదగిరి పారిపోయి వచ్చాడు. అనంతరం వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.